# సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - నాణ్యమయిన విద్య

# Sustainable Goals – Quality Education


**రచయిత**

ఇ.ఢి. మధుసూధన్ రెడ్డి

స్కూల్ అసిస్టెంట్ (బయాలజి)

ఫ్యాకల్టీ, యస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ

**ఎడిటింగ్**

డా. ఎస్. సురేష్ బాబు, కన్సల్టెంట్,

స్కూల్ లీడర్ షిప్ అకాడమీ,

యస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్, తెలంగాణ

**ముఖ్యసలహాదారు**

సంచాలకులు,

యస్.సి.ఇ.ఆర్.టి, తెలంగాణ


**2024-25**

స్కూల్ లీడర్ షిప్ అకాడమి

యస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ, హైదరాబాద్

నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్ షిప్,

యస్.ఐ.ఇ.పి.ఎ. (NCSL – NIEPA), న్యూఢిల్లీ

## పరిచయం

మానవ అభివృద్ధి నిరంతరం కొనసాగే ప్రక్రియ. ఆదిమానవుని నుండి ప్రస్తుత శాస్త్ర సాంకేతిక యుగం వరకు అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. ఈ మానవాభివృద్ధిలో అనేక దశలు ఉన్నాయి, మైలురాళ్ళు ఉన్నాయి. ఈ ప్రయాణంలో పారిశ్రామిక యుగం అనేది ఒక పెద్ద మైలురాయి. పరిశ్రమల ఏర్పాటు, వస్తు ఉత్పత్తి, సహజ వనరుల వినియోగము లాంటి అంశాలు ప్రపంచవ్యాప్తంగా మానవుల అభివృద్ధిలో కీలకమైన మార్పులు తెచ్చాయి. ఆ మార్పులు నిరంతరం కొనసాగుతూ ప్రస్తుతం కూడా కొనసాగుతున్నాయి. ఈ అభివృద్ధి క్రమంలో మానవ ప్రపంచం సహజ వనరులను కోల్పోవడం, మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేసుకోవడం, దేశాల మధ్య అసమానతలు, సమాజంలో అసమానతలు పెరగడం కొనసాగుతున్నది. కొన్ని చోట్ల ఈ అభివృద్ధి ప్రగతికి దారితీసి మానవ సంబంధాలు, దేశాల అభివృద్ధికి, వనరుల సద్వినియోగానికి ఉపయోగపడితే ప్రపంచ వ్యాప్తంగా కొన్ని చోట్ల ఇది అసమానతలకు దారితీసింది. ప్రతీ దశలో ఈ విపరీత ధోరణులను కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు, కొన్ని దేశాలు వీటి పైన ప్రత్యేక దృష్టిని ఉంచి మెరుగుదలకు ప్రయత్నించడం జరుగుతున్నది.

ఆ ప్రయత్నాలలో భాగంగా అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసాన్ని నివారించే దిశగా సెప్టెంబర్ 2000 సంవత్సరంలో ↵ మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను 2015 సంవత్సరం వరకు సాధించాలని నిర్ధారించుకోవడం జరిగింది. ఈ మిలీనియం అభివృద్ధి లక్ష్యాల ప్రగతి ఆశించిన రీతిలో లేకపోవడం మరిన్ని సవాళ్లు ప్రపంచం ముందుకు రావడంతో మరికొన్ని లక్ష్యాలను ప్రపంచం నిర్దేశించుకోవాల్సి వచ్చింది. ఆలా నిర్దేశించుకున్నవే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు. ప్రస్తుతం నిర్ధారించుకున్న 17 లక్ష్యాలలో మిలీనియం అభివృద్ధి లక్ష్యాలయిన ↵అంశాలు కూడా భాగంగా ఉన్నాయి. అభివృద్ధి అవసరమే, కానీ అది సుస్థిరాభివృద్ధి అయి ఉండాలి. సహజ వనరులతో పాటు మానవ సంబంధాలు, దేశాల మధ్య సంబంధాలు, ప్రజల మధ్య సంబంధాలను సరైన రీతిలో కొనసాగించడం అత్యంత అవసరం. అన్ని వనరుల విధ్వంసం అభివృద్ధి పేరిట జరుగుతూనే ఉంది. అనాదిలో

సమానతతో ఉద్భవించిన ప్రపంచాన్ని అసమానతలలోకి నెట్టిన అనేక అంశాలను రూపుమాపే ప్రక్రియ సమర్థవంతంగా, విజయవంతంగా కొనసాగకపోవడంతో అసమానతలు పెరగడం ఎక్కువైంది. అభివృద్ధి ద్వారా సమానత సాధించే బదులు అసమానతలు పెరగడం అనేది అభివృద్ధిని ప్రశ్నార్థకంగా మార్చాయి. పేదరికం పెరగడం, ఒక దిక్కు అంతులేని ఐశ్వర్యం - మరొక దిక్కు ఆకలి బాధలు, ఒక వైపు ఆహార కొరత - మరో దిక్కు ఆహారాన్ని వృధా చేయడం, అభివృద్ధికి కీలకమైన విద్య అందరికీ సమానంగా అందకపోవడం, నాణ్యమైన విద్య అందుబాటులోకి లేకపోవడం, విద్య ఆర్థిక సాంఘిక అంశాల పైన ఆధారపడి పొందగలగడం, కనీస వసతులైన తాగునీరు, పారిశుద్ధ్యము, గౌరవప్రదమైన ఉపాధులు లేకపోవడం, వాతావరణ కాలుష్యాలు పెరగడం, జీవులకు భూమిపైన ఉన్న అన్ని ఆవాస ప్రాంతాలలో సరైన రక్షణ లేకపోవడం, వ్యక్తులు దేశాలు సమాజాల మధ్య శాంతి, న్యాయం కరువవడంలాంటి అంశాలు ప్రపంచం ముందు ఎన్నో ప్రశ్నలను పెట్టాయి.

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకోవడం జరిగింది.ఇందుకు 193 సభ్య దేశాలు అంగీకారం తెలిపాయి. అందులో భారతదేశం కూడా ఒకటి. 2016 నుండి అమల్లోకి వచ్చిన ఈ అంశాల సాధనకు కరోనా మహమ్మారి కొంత అడ్డంకిగా నిలిచినప్పటికీ మానవ సమాజాలన్నీ ప్రపంచవ్యాప్తంగా ఈ లక్ష్యాల సాధనకు కృషి చేయవలసిన అవసరం ఉంది. మనం ఇప్పుడు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన నాణ్యమైన విద్య - నాణ్యమైన విద్యలో దృష్టి పెట్టవలసిన అంశాల గురించి తెలుసుకుందాం. పాఠశాల దశ నుండి విద్యార్థులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించి దైనందిన జీవితంలో వాటిని అమలుపరిచేలా అవగాహన కల్పించవలసి ఉంది. ఇందుకు పాఠశాల నాయకులు ప్రముఖ పాత్ర పోషించాలి. ఏ దేశంలో అయినా, ఏ సమాజంలో అయినా కుటుంబము, పాఠశాల, సమాజము మార్పుకు కేంద్రాలుగా ఉంటాయి. అభివృద్ధిచెందుతున్న దేశాలలో మార్పు అనేది విద్య ద్వారానే సాధ్యం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి పాఠశాలల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల గురించి అవగాహన కల్పించడం ద్వారా ఈ మార్పును మనము వేగవంతం చేయవలసి ఉంది. పాఠ్యప్రణాళికలో ఈ అంశాలను చేర్చడం, విద్యార్థులకు పాఠ్యాంశాల ద్వారా అవగాహన కల్పించడం మరియు నిత్య జీవితంలో అమలుచేసేలా ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. కాబట్టి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఒకటైన నాణ్యమైన

విద్య, నాణ్యమైన విద్యకు సంబంధించిన అంశాలు, వీటి సాధనలో పాఠశాల నాయకులు పోషించవలసిన పాత్ర గురించి మనం ఇప్పుడు చర్చిద్దాం.

## మాడ్యుల్ రూపకల్పన లక్ష్యాలు

1. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల నేపథ్యాన్ని తెలుసుకోవడం
2. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అంశాల పట్ల అవగాహన కల్పించడం
3. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, నాణ్యమయిన విద్యకు మధ్య గల సంబంధాలను గుర్తింపచేయడం
4. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అమలులో భాగంగా పాఠ్య ప్రణాళికలో చేర్చిన అంశాల గురించి చర్చించడం
5. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పాఠశాల నాయకుల పాత్ర గురించి వివరించడం

## మాడ్యూల్ లో చర్చించిన అంశాలు

1. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు
2. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు – నాణ్యమైన విద్య
3. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పాఠశాల నాయకుల పాత్ర

# యూనిట్ 1: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు

## (Sustainable Development Goals)

### అభ్యసన ఫలితాలు

1. **సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను గుర్తిస్తారు.**
2. **సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన ఆవశ్యకతను వివరిస్తారు.**
3. **సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు నాణ్యమయిన విద్యకు గల సంబంధాన్ని గుర్తిస్తారు.**

2030 నాటికి ప్రపంచంలోని బహుముఖ రంగాలలో పేదరికాన్ని రూపుమాపడానికి, విశ్వ శ్రేయస్సు కోసం సమానత్వంతో కూడిన న్యాయమైన సురక్షిత ప్రపంచాన్ని రూపొందించడానికి చేసుకున్న సార్వత్రిక ఒప్పందమే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (Sustainable Development Goals - SDG). సుస్థిరాభివృద్ధి అంటే భవిష్యత్ తరాలవారి అవసరాలకు లోటురాకుండా ప్రస్తుత అవసరాలను తీర్చుకోవడం. సెప్టెంబర్ 2017లో నిర్వహించిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమ్మేళనంలో 193 సభ్య దేశాలు పాల్గొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు అంగీకారాన్ని తెలిపాయి. ఇది 1 జనవరి 2016 తేదీ నుండి అమల్లోకి వచ్చింది.మన ప్రపంచాన్ని పరివర్తన చేయడంలో కీలకపాత్ర పోషించే 17 అంశాలను సుస్థిరాభివృద్ధి లక్ష్యాలుగా నిర్దేశించుకోవడం జరిగింది. 2030 సంవత్సరము నాటికి ఈ 17 లక్ష్యాలు సాధించుటకు సభ్య దేశాలు కృషి చేస్తున్నాయి. అందులో భారతదేశం కూడా ఒకటి. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమ్మేళనంలో సభ్య దేశాలు పాల్గొని అంగీకారాన్ని తెలిపిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల వివరాలు:

### సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (SDG)

1. పేదరికాన్ని నిర్మూలించడం
2. ఆకలి బాధలను నివారించే ఆహార భద్రతను కల్పించి, పోషకత్వాన్ని మెరుగుపరచడం
3. ఆరోగ్య సంరక్షణ - జీవన ప్రమాణాల పెంపు

4. నాణ్యమైన విద్య

5. లింగ సమానత్వం సాధించి మహిళా సాధికారతను పెంపొందించడం (జెండర్ సమానత)

6. అందరికీ తాగునీటి వసతిని కల్పించడం, పారిశుద్ధ్యాన్ని పెంపొందించడం

7. అందరికీ అందుబాటులో ఉండే విధంగా చౌకగా సుస్థిర శక్తి వనరులు అందించడం

౮ గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక అభివృద్ధి

౯ పరిశ్రమలు, ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు

10. అసమానతల తొలగింపు

11. సుస్థిర నగరాలు మరియు సమూహాలు

12. బాధ్యతాయుతమయిన వినియోగము, ఉత్పత్తి

13. వాతావరణ పరిరక్షణ

14. సముద్ర, జలజీవుల పరిరక్షణ

15. నేలపై నివసించే జీవుల పరిరక్షణ

16. శాంతి, న్యాయం మరియు ధృడమైన వ్యవస్థలు

17. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (SDG) సాధన కొరకు భాగస్వామ్యాలు

ఈ 17 లక్ష్యాలు 169 ఉప లక్ష్యాలు, 306 సూచికలను కలిగి ఉన్నాయి.

2020లో ఐక్యరాజ్యసమితి గణాంక కమిషన్ 51వ సమావేశంలో అన్ని సూచికలను ఒకసారి సమగ్రంగా సమీక్షించారు. 2020 నుండి 2023 వరకు కోవిడ్ 19 మహమ్మారి చూపిన ప్రభావం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సవాలుగా, ప్రతిబంధకంగా మారింది. కాబట్టి 2030 నాటికి అన్నీ కాకపోయినా ఎక్కువ లక్ష్యాలు ముఖ్యంగా కీలకమైన లక్ష్యాలు సాధించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ అంశాలను మరల 2025లో మళ్ళీ సమీక్షించడం జరుగుతుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 17 లో 13 లక్ష్యాలను మన దేశంలో నీతి ఆయోగ్ పరిగణనలోకి తీసుకుంటున్నది. మిగిలిన నాలుగు లక్ష్యాలయిన బాధ్యతాయుతమయిన వినియోగము, ఉత్పత్తి;

వాతావరణ పరిరక్షణ; సముద్ర, జలజీవుల పరిరక్షణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (SDG) సాధనకు భాగస్వామ్యాలను మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో నాలుగవది నాణ్యమయిన విద్య. ఈ లక్ష్య సాధన మిగిలిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఎంతో దోహదపడుతుంది. ఈ లక్ష్యం ద్వారా అందరికీ సమానమయిన, సమ్మిళితమయిన నాణ్యమయిన విద్యను అందించడం మరియు జీవితకాలం నేర్చుకునే అవకాశాలను ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ లక్ష్యాన్ని సాధించడం ద్వారా విద్యలో అసమానతలు తగ్గడం, పేదరికం తగ్గడం, మెరుగయిన ఆరోగ్యం, జెండర్ సమానత, శాంతి మరియు స్థిరమయిన సమానత్వ ప్రపంచాన్ని పెంపొందించడం సాధ్యమవుతుంది.

అభివృద్ధి నుండి స్థిరమైన అభివృద్ధి వరకు సాగే ప్రయాణంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (SDG) ప్రస్తుతం ఆవశ్యక అంశాలు. 2012 సంవత్సరంలో బ్రెజిల్ లోని రియో డిజనీరోలో జరిగిన ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి సదస్సులో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (SDG) ఆవిర్భవించాయి. మన ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యవసర పర్యావరణ, రాజకీయ మరియు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడంలో సహాయపడే సార్వత్రిక లక్ష్యాలను రూపొందించడం దీని ఉద్దేశ్యం. గతంలో నిర్ధారించుకొనిన మిలీనియం అభివృద్ధి లక్ష్యాల మాదిరిగా కాకుండా, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (SDG) సాధనకు అవసరమయిన అన్నిసవాళ్లను పరిష్కరించడానికి కావలసిన సృజనాత్మకత మరియు ఆవిష్కరణలను అమలుచేయాలని ఈ సందర్భంలో స్పష్టంగా నిర్దేశించుకోవడం జరిగింది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (SDG)లోని గొప్పదనం ఏమిటంటే, ప్రతి ఒక్కరూ సహకరించుకోవడం మరియు ప్రతీ సహకారం చిన్నదైనా, పెద్దదైనా మన ప్రపంచంపై ప్రభావం చూపుతుందని గుర్తించడం. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న మరియు పరివర్తన చెందుతున్న దేశాలలోమారుతున్న వాతావరణం యొక్క ప్రతికూల ప్రభావం మరియు పెరుగుతున్న అసమానతలను గుర్తించి అవసరమయిన చర్యలు చేపట్టడంలో లక్ష్యాల యొక్క సానుకూల ప్రభావం మరియు అవి స్థానిక సమాజాలకు మెరుగైన అవకాశాలను సృష్టించడంలో సహాయపడడం. ప్రపంచం మొత్తం ఏకతాటిపై లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలి. తద్వారా మనం మనందరికీ మెరుగైన ప్రపంచాన్ని సృష్టించగలము. ప్రస్తుత మన విధానాల అమలు తీరే రేపటి మెరుగయిన ప్రపంచాన్ని తీర్చిదిద్దుకోవడానికి మార్గాలు. అవే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (SDG).

# యూనిట్ 2: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు – నాణ్యమయిన విద్య

## (Sustainable Development Goals – Quality Education)

### అభ్యసన ఫలితాలు

1. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు మరియు నాణ్యమయిన విద్యకు మధ్య గల సంబంధాన్ని గుర్తిస్తారు.
2. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించి నాణ్యమయిన విద్యలో పరిగణించిన ఇతివృత్తాల గురించి వివరిస్తారు.
3. సుస్థిరాభివృద్ధి కోసం విద్య (Education for Sustainable Development - ESD)మరియు ప్రపంచ పౌరసత్వ విద్యా (Global Citizenship for Educational Development - GCED) సాధన ఆవశ్యకతను గుర్తిస్తారు.
4. సుస్థిరాభివృద్ధి కోసం విద్య (ESD) మరియు ప్రపంచ పౌరసత్వ విద్యా (GCED) సాధన కోసం విద్యా శాఖ చేపట్టిన వివిధ అంశాలను వివరిస్తారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (SDG) లో నాలుగవది నాణ్యమైన విద్య. ఇదిఅభ్యాసకుల జీవన ప్రమాణాన్ని మరయు సమాజ భవిష్యత్తును మెరుగుపరుస్తుంది.దీని ప్రకారం అందరికీ సమగ్ర (comprehensive)మరియు సమానతతో కూడిన (equity) నాణ్యమైన విద్య (quality education)ను నిర్ధారించి జీవితకాల అభ్యసన అవకాశాలను ప్రోత్సహించడం జరగాలి. ఈ లక్ష్యసాధన సూచికలు:

1. ప్రాథమిక పాఠశాలల్లో హాజరు రేటు
2. ప్రాథమిక పాఠశాల విద్య పూర్తి రేటు
3. సెకండరీ విద్యలో చేరడం
4. పాఠశాల భవనాల సౌకర్యాలు (విద్యుత్తు, అంతర్జాలం, కంప్యూటర్లు, తాగునీరు, మరుగుదొడ్లు మొదలగునవి.)

విద్యకు సంబంధించిన అంశాలలో ప్రపంచ వ్యాప్తంగా పురోగతి ఉన్నప్పటికీ 6 నుండి 17 సంవత్సరాల వయసు గల లక్షల మంది పిల్లలు పాఠశాల విద్యకు దూరంగా ఉండడం,50% పైగా విద్యార్థులు చదువడం - రాయడం వంటి కనీస సామర్థ్యాలలో వెనుకబడి ఉండడం ఆందోళనకర అంశం. బాల, బాలికలు: పట్టణ, గ్రామీణ; పేద, ధనిక; దివ్యాంగుల వంటి అసమానతలను అధిగమించవలసి ఉంది. "సుస్థిరాభివృద్ధి లక్ష్యం 4 – నాణ్యమయిన విద్య"కు సంబంధించి పది లక్ష్యాలు నిర్దేశించుకోవడం జరిగింది. అవి

1. ఉచిత ప్రాథమిక మరియు సెకండరీ విద్య
2. నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య అందరికీ సమానంగా అందుబాటు
3. సాంకేతిక విద్య, వృత్తి విద్య మరియు ఉన్నత విద్య అందరికీ సమానంగా అందుబాటు
4. ఆర్థిక విజయం కోసం సంబంధిత నైపుణ్యాలు కలిగిన వ్యక్తుల సంఖ్యను పెంచడం
5. విద్యలో అన్ని రకాల వివక్షతలను తొలగించడం
6. సార్వత్రిక మౌలిక భాషా మరియు గణిత సామర్థ్యాల సాధన (FLN)
7. సుస్థిరాభివృద్ధి మరియు ప్రపంచ పౌరసత్వం కోసం విద్య

↵ భద్రత మరియు సమ్మిళిత పాఠశాలలను రూపొందించడం

↳ అభివృద్ధి చెందుతున్న దేశాల వారి ఉన్నత విద్యకు స్కాలర్షిప్ లను విస్తరించడం

10. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ సంఖ్యలో అర్హత కలిగిన ఉపాధ్యాయులను అందించడం

సుస్థిరాభివృద్ధి లక్ష్యం– 4 సాధన అనేది ఇతర సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనతో సంబంధం కలిగి ఉంటుంది. అవి పేదరిక నిర్మూలన, ఆరోగ్యము మరియు శ్రేయస్సు, జెండర్ సమానత, స్థిరమైన ఆర్థికాభివృద్ధి, అందరికీ గౌరవప్రదమైన ఉపాధి, మౌలిక సదుపాయాలు, వేగవంతమయిన నవకల్పనలు,దేశాల మధ్య అసమానతలు తగ్గించడం,ప్రకృతికి అనుగుణంగా స్థిరమైన వినియోగం మరియు ఉత్పత్తి, వాతావరణ మార్పులు ఎదుర్కోవడానికి తక్షణ చర్యలు తీసుకోవడం కోసం అవగాహన పెంపొందించడం మరియు శాంతియుత సమ్మిళిత సమాజాలను ప్రోత్సహించడం.

సుస్థిరాభివృద్ధి లక్ష్యం – 4 కు సంబంధించిన అంశాల ప్రస్తుత స్థితిని అంచనా చేయడానికి 75% దేశాల్లో గణాంకాలు (data) లేవు, ఉన్ననూ కొన్ని చోట్ల పూర్తి స్థాయిలో గణాంకాలు లేవు. తగినంత సమాచారం లేనందున పురోగతిని ట్రాక్ చేయడం కష్టంగా ఉంది. ఇది పిల్లల విద్యకు సంబంధించిన అంశాల విశ్లేషణ మరియు స్థాయిలను గుర్తించడాన్ని కష్టతరంగా చేస్తున్నది.

2030 నాటికి సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించడానికి అవసరమైన జ్ఞానం మరియు నైపుణ్యాలను అభ్యాసకులందరూ పొందగలగాలి. స్థిరమైన జీవనశైలి, మానవ హక్కులు, జెండర్ సమానత, శాంతి మరియు అహింసల సంస్కృతిని ప్రోత్సహించడం, ప్రపంచ పౌరసత్వం మరియు సంస్కృతి వైవిధ్యం యొక్క గొప్పదనం మరియు స్థిరమైన అభివృద్ధికి సంస్కృతి సహకారం వంటి అంశాల పట్ల అభ్యాసకులందరూ అవగాహన పొందేలా చూడాలి.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - 4.7

సుస్థిరాభివృద్ధి అంటే భవిష్యత్ తరాల వారు సొంత అవసరాలను తీర్చుకునే సామర్థ్యంలో రాజీపడకుండా ఉండేలా ప్రస్తుత అవసరాలను తీర్చుకోవడం.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు – 4 నాణ్యమయిన విద్యకు సంబంధించి 7 వ అంశం లో రెండు ఇతివృత్తాలు కలవు. అవి సుస్థిరాభివృద్ధి కొరకు విద్య (Education for Sustainable Development - ESD) మరియు ప్రపంచ పౌరసత్వ విద్య (Global citizenship Education – GCED). ఈ ఇతివృత్తాలకు సంబంధించి ఆరు ఉప ఇతివృత్తాలు కలవు. అవి

1. సుస్థిరాభివృద్ధి
2. మానవ హక్కులు
3. శాంతి మరియు అహింస
4. ప్రపంచ పౌరసత్వము
5. జెండర్ సమానత
6. వైవిధ్యం

వీటికి సంబంధించి అభ్యాసకులందరిలో నాణ్యమయిన విద్యను సాధించే క్రమంలో అభ్యసనములో జ్ఞానము, నైపుణ్యాలు, సామర్ధ్యాలు, విలువలు, వైఖరులు మరియు ప్రవర్తనలు పెంపొందించాల్సి ఉంటుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో నాణ్యమైన విద్యకు సంబంధించిన ఇతివృత్తాలు, వాటికి సంబంధించిన ఆరు ఉప ఇతివృత్తాలసాధన కొరకు కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించవలసి ఉంటుంది.పాఠ్య ప్రణాళికలో ఒక్కో సబ్జెక్టుకు సంబంధించి ఏ ఏ అంశాలు ఉన్నాయో గుర్తించి ఆయా అంశాలను పాఠశాలల్లో, తరగతులలో లక్ష్యాత్మకంగా అమలు చేయవలసి ఉంటుంది.

మన దేశ మరియు మన తెలంగాణా రాష్ట్ర పాఠ్యప్రణాళికలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు ఒక భాగంగా కలవు. ఈ పాఠ్యప్రణాళిక నిరంతర అన్వేషణ, పర్యావరణ స్పృహ కలిగిన, బాధ్యతాయుతమైన మరియు విశ్వమానవభావన కలిగిన పౌరులుగా తీర్చి దిద్దేలా సామాజికంగా ఒకతరాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన అంశాలు ఒక ప్రత్యేక సబ్జెక్టుగా కాకుండా పాఠ్యప్రణాళికలో మిళితమై ఉంటాయి. అన్ని సబ్జెక్ట్ ల పాఠ్యపుస్తకాల్లో సుస్థిరాభివృద్ధికి సంబంధించిన అంశాలు కలవు. ముఖ్యంగా 3 నుండి 10 తరగతుల వరకు పరిసరాల విజ్ఞానం, సామాన్య శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రాలు, భాషలలో కూడా పర్యావరణ విద్యకు స్థానం కల్పించడం జరిగింది. ఇది సమ్మిళిత పాఠ్య ప్రణాళిక రూపంలో (Curriculum Integration) విద్యార్థులు స్థిరమైన మరియు సమగ్రమైన విద్యను పొందేలా మరియు సుస్థిరతపై వారి అభ్యసన అనుభవంలో ఒక ప్రధాన భాగంగా ప్రభావం చూపుతున్నది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - 4.7.1 లోని ఆరు ఉప ఇతివృత్తాలకు సంబంధించి మన రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో మరియు వివిధ విద్యా సంబంధ కార్యక్రమాలలో అమలు చేస్తున్న, చేయవలసిన వాటి వివరాలు తెలుసుకుందాం.

## 1. సుస్థిరాభివృద్ధి

తెలంగాణలో సుస్థిర అభివృద్ధికోసం అనేక ప్రశంసనీయమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. రాష్ట్రానికి హరిత భవిష్యత్తును పెంపొందించేందుకు పాఠశాలల్లో పర్యావరణ సుస్థిరత మరియు పర్యావరణ స్పృహకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. పాఠ్యప్రణాళికలో పర్యావరణ విద్యను భాగం చేయడంతో పాటు వివిధ సబ్జెక్టులు మరియు కార్యక్రమాలకు అనుసంధానం చేయడం వరకు, ప్రతి ఒక్కటీ రాష్ట్ర

హరిత ఎజెండాకు గణనీయంగా దోహదంచేస్తున్నాయి. ఇందులో పాఠశాలల్లో సౌర ఫలకలు (solar panels) ఏర్పాటుచేయడం చెప్పుకోదగ్గ ప్రయత్నాల్లో ఒకటి.

సౌరశక్తి పునరుద్ధరింపదగిన శక్తి వనరు. ఇది సంప్రదాయ విద్యుత్తుపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అదేవిధంగా పునరుత్పాదకశక్తి గురించి తెలుసుకోవడానికి విద్యార్థులకు ఒక విద్యాసాధనంగా పనిచేస్తుంది. సౌర ఫలకలు పాఠశాలల యొక్క విద్యుత్ బిల్లులను తగ్గించడంలో సహాయపడటంతో పాటు హరిత సాంకేతికపరిజ్ఞానం యొక్క ఆచరణాత్మక అమలును ప్రదర్శించడం కౌమారమనస్సులలోపర్యా వరణబాధ్యత యొక్క భావాన్ని పెంపొందిస్తుంది.

ప్రతి పాఠశాలలో కంపోస్టు గుంతలు, ఇంకుడు గుంతల నిర్మాణం సుస్థిరాభివృద్ధి ప్రయాణంలో మరొక గణనీయమైన కొలమానం.

కంపోస్టు గుంతలు, గార్డెనింగ్ మరియు ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగించగల కంపోస్టుగా సేంద్రీయ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడానికి దోహదపడతాయి. ఇంకుడు గుంతలు భూగర్భజల మట్టాలను రీఛార్జ్ చేయడంలో సహాయపడుతాయి. తద్వారా నీటి సంరక్షణ జరుగుతుంది. ఈ పద్ధతులువ్యర్థాల నిర్వహణ మరియు నీటి సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు బోధించడం, ప్రోత్సహించడం చిన్న వయసు నుంచే స్థిరమైన అలవాట్లుగా రూపొందుటకు సహాయపడుతున్నాయి. వ్యర్థాలను తగ్గించే ప్రయత్నాలలో అనేక పాఠశాలలు గణనీయమైన ప్రగతిని సాధించాయి. కొన్ని సున్నా వ్యర్థ స్థాయిలకు కూడా చేరుకున్నాయి. పదార్థాల రీసైక్లింగ్ మరియు పునర్వినియోగం(Re-use)తో సహా సమగ్ర వ్యర్థాల నిర్వహణ వ్యూహాల విజయం సుస్థిరాభివృద్ధి కార్యక్రమాల ప్రభావాన్ని మరియు పర్యావరణ పరిరక్షణకు పాఠశాలు చేస్తున్న కృషిని తెలియజేస్తున్నాయి. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రోత్సాహకాలు సాధించిన పాఠశాలలు వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారానే ఎన్నిక కావడం జరిగింది.

తెలంగాణలో పచ్చదనాన్ని పెంపొందించడంలో భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం అయిన హరిత హారం మరియు వన మహోత్సవం అమలు కీలక పాత్ర పోషిస్తుంది.

అలాంటి ప్రయత్నాల ఫలితంగా యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ నివేధిక ప్రకారం రాష్ట్రం పచ్చదనంలో గణనీయమైన పెరుగుదల 7.7% ను సాధించింది. పాఠశాలలు తమ పరిధిలో చెట్లను నాటడం

ద్వారా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నాయి. పాఠశాలల ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాలను అందంగా మార్చడంతో పాటు పచ్చదనాన్ని పెంచడం ద్వారా వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, పర్యావరణాన్ని కాపాడడంలో కూడా ఇది దోహదం చేస్తుంది.

↳ 10 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం పర్యావరణ విద్య పేరిట ప్రత్యేక బుక్ లెట్లను ప్రవేశపెట్టింది. ఈ బుక్ లెట్ లలో పర్యావరణంపై దృష్టి సారించే వివిధ ప్రాజెక్టులు ఉన్నాయి. విద్యార్థులు ఆచరణాత్మక కార్యకలాపాల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం ద్వారా సుస్థిర పద్ధతుల గురించి నేర్చుకుంటారు. దీని వలన విద్యార్థులు పర్యావరణ సమస్యలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని పరిష్కరించే నైపుణ్యాలను పొందుతున్నారు.

పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎకో క్లబ్ లు ఈ ప్రయత్నాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఈ క్లబ్బులు చురుకుగా పనిచేస్తున్నాయి. మొక్కల పెంపకంతో సహా వివిధ పర్యావరణ కార్యకలాపాలను నిర్వహించడం మరియు పాల్గొనడంలో ఈ క్లబ్బు సభ్యులు పాల్గొంటున్నారు, మిగిలిన వారిని పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ఫలితాలను క్రమం తప్పకుండా "మేరీ లైఫ్" పోర్టల్ లో అప్ లోడ్ చేస్తున్నారు. ఇది ఈ క్లబ్ ల యొక్క ప్రయత్నాలు మరియు విజయాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ఉంటున్నది. ఎకో క్లబ్ లు సమాజ మరియు బృంద భావనను, విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను, సాధికారతను పెంపొందిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎన్జీవోల (ఉదాహరణకు Centre for Green Revolution - CGR) సహకారంతో ఉపాధ్యాయులు విత్తన బంతులు విద్యార్థుల సహకారంతో వేసవిలో తయారు చేసి వానాకాలంలో చల్లడం ఎక్కువ మొక్కల పెంపకానికి ఉపయోగపడుతున్నది. దీని ద్వారా గ్రామాల సమీపంలోని గుట్టలు, కొండలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. విద్యార్థులు వేసవిలో పిచ్చుకలకు కృత్రిమ గూడులను తయారు చేసి పిచ్చుకలకు ఆహారం, నీరు మరియు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియ చేపట్టిన చోట్ల పిచ్చుకల సంరక్షణ, పిచ్చుకల సంఖ్య పెరుగుతున్నది.

## 2. మానవ హక్కులు

మానవ హక్కుల విద్యను పాఠశాల పాఠ్యప్రణాళికలో ముఖ్యంగా ↵ ↳ 10 తరగతుల పాఠ్యపుస్తకాల్లో చేర్చడం జరిగింది. పాఠ్యపుస్తకాల్లో పేర్కొన్న అంశాలకు సంబంధించి విద్యార్థులను చర్చలు మరియు ప్రాజెక్టులలో నిమగ్నం చేయడం జరుగుతున్నది. మానవ హక్కుల ప్రాముఖ్యతను, వాస్తవ ప్రపంచ సంఘటనలకు అన్వయించి కూడా వివరించడం జరుగుతున్నది. ఇవి మానవ సమాజంలో సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటివాటి ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు సహాయపడతాయి. వారి దైనందిన జీవితంలో మరియు విస్తృత సామాజిక సందర్భాలలో హక్కుల గురించి పిల్లల్లో అవగాహన కల్పించడం వలన మానవ హక్కుల ఉల్లంఘన వంటి వాటిని ఎలా గుర్తించాలి, ఎలా ప్రతిస్పందించాలనే దానిపై విద్యార్థులకు అవగాహన పెరిగింది. మానవ హక్కులకు విలువనిచ్చే, నిలబెట్టే తరాన్ని పెంపొందించడానికి ఈ సాధికారత దోహదపడుతున్నది. జాతీయ దినోత్సవాలు, ప్రత్యేక సమావేశాలలో విద్యార్థులు ఈ అంశంపై వివరంగా మాట్లాడగలుగుతున్నారు.

పాఠశాల విద్యాశాఖ మానవ హక్కులపై ఒక మాడ్యూల్ ను రూపొందించి, రాష్ట్రంలోని సెకండరీ స్కూల్ టీచర్లందరికీ వృత్యంతర శిక్షణను అందించింది. ఇందులో భాగంగా మానవహక్కుల ప్రాముఖ్యత, భారత రాజ్యాంగం, హక్కుల పరిరక్షణ, వివక్ష, మానవ హక్కుల సంస్కృతి, బాలల హక్కులు,బాలల ఉచిత నిర్బంధ విద్య హక్కు మొదలగు అంశాలను చర్చించడం జరిగింది.

ప్రతినెలా 30 వ తేదీ న పౌరహక్కుల దినోత్సవాన్ని రెవెన్యూశాఖ నిర్వహిస్తోంది. మానవహక్కులతో సహా పౌరహక్కుల అమలును సమీక్షించడం జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయవలసిన అవసరం ఉంది. ప్రత్యక్ష అనుభవం, బాధ్యతాయుతమైన మరియు అవగాహన కలిగిన పౌరులుగా రూపొందడంలో తోడ్పడుతుంది. అదనంగా, పేరెంట్-టీచర్ సమావేశాలలో తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించగలగాలి. మానవహక్కుల విద్య పరిధిని విస్తరించడమే ఈసమావేశాల లక్ష్యంగా ఉండాలి. తరగతిగది, తల్లిదండ్రులకు సమాచారం అందించడం మరియు వీటిని బలోపేతం చేయడం ద్వారా మానవహక్కుల వాతావరణం గల సమాజాన్ని పెంపొందించవచ్చు. ఈ కార్యక్రమాలు మరింత బలోపేతంగా, లక్ష్యాత్మకంగా జరిగేలా ప్రయత్నించవలసి ఉంది.

## 3. శాంతి మరియు అహింస

పాఠశాలల్లో విద్య ద్వారా శాంతి మరియు అహింసను ప్రోత్సహించడం, సానుభూతి వాతావరణం, సంఘర్షణ పరిష్కారం, భావోద్వేగాలపై దృష్టి పెట్టడం, సహానుభూతి మరియు నిర్మాణాత్మక సంఘర్షణ పరిష్కార విధానాలను అమలు చేయడం జరుగుతున్నది. పాఠశాలల్లో వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకునేలా, విద్యార్థుల మధ్య విభేదాలను పరిష్కరించడం లక్ష్యంగా, ఉపాధ్యాయులుమరియు ఇతర పాఠశాల సిబ్బంది మధ్యవర్తిత్వం మరియు సంభాషణల ద్వారావిద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తారు. వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవడం, అవగాహన మరియు సహకార సంస్కృతిని పెంపొందించడం. భావోద్వేగ మేధస్సు (Emotional Intelligence), సహానుభూతి పెంపొందించడంపై అవగాహన, స్వీయ నియంత్రణ, ప్రేరణ మరియు సామాజిక నైపుణ్యాలవంటి వాటిలో అవగాహన పొందుటకు ప్లేయింగ్, గ్రూప్ డిస్కషన్ లు మరియు ఇంటరాక్టివ్ సెషన్ లు నిర్వహించడం జరుగుతున్నది.

భావోద్వేగాలు, ఇతరుల భావాలను గుర్తించడం మరియు దయగల సంబంధాలను పెంపొందించుకోవడం వంటి నైపుణ్యాలను పాఠ్యప్రణాళికలో సమ్మిళితం చేయడం ద్వారా, పాఠశాలలు ఒక గొప్ప సమ్మిళిత వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. విద్యార్థులలో భావోద్వేగ శ్రేయస్సును పెంపొందించుటకు 6 – ↵తరగతులకు ఒక మాడ్యూలు, ↳-10 తరగతులకు మరొక మాడ్యూలును రూపొందించి పాఠశాలలకు అందజేయం జరిగింది. ఈ అంశాలకు వారానికి రెండు పీరియడ్లు కేటాయించి విద్యార్థులతో చర్చించడం జరుగుతున్నది. ఈ అంశాలు మరింత లక్ష్యాత్మంగా జరగవలసి ఉంది.

పాఠ్య ప్రణాళిక ప్రకారం అన్ని సబ్జెక్ట్ లలో సమ్మిళితంగా శాంతి మరియు అహింస అంశాలు ఉన్నప్పటికీ ముఖ్యంగా సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఈ అంశాలు ప్రధానంగా చర్చించడం జరిగింది. ఈ పాఠ్యాంశాలలో సంఘర్షణ పరిష్కారం, మానవ హక్కులు మరియు అహింసతోపాటు అహింసాయుత ప్రతిఘటన కోసం కృషిచేసిన గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ల అంశాలను విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు చేర్చడం జరిగింది. ఈ అంశాల ద్వారా విద్యార్థులు హింస లేని శాంతియుత సహజీవనం యొక్క ప్రాముఖ్యతను నేర్చుకుంటున్నారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల సందర్భంగా అహింస ద్వారా స్వాతంత్ర్యాన్ని సాధించడం యొక్క ప్రాముఖ్యతను స్మరించుకుంటూ, స్వాతంత్ర్యోద్యమంలో ఉపయోగించిన అహింసా పద్ధతుల గురించి, శాసనోల్లంఘన సూత్రాల అంశాలపై వ్యాసరచన పోటీలతో సహా వివిధ

కార్యక్రమాలు మరియు ప్రదర్శనలు పాఠశాలల్లో నిర్వహించబడ్డాయి. ఈ కార్యకలాపాలు వారిని గర్వపడేలా మరియు బాధ్యతను పెంపొందించేలా, వారి జీవితాల్లో అహింస యొక్క విలువలను నిలబెట్టేలా ప్రోత్సహించాయి.

మహాత్మాగాంధీ అహింసా తత్వం గురించి విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో "గాంధీ" సినిమా ప్రదర్శనలను ఏర్పాటు చేసింది. గాంధీ జీవితం, అహింస పట్ల అతని నిబద్ధత మరియు అతని పాత్ర గురించి వివరణాత్మక వర్ణనను అందిస్తుంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం, అహింసా సూత్రాలు మరియు శాంతియుత ప్రతిఘటన యొక్క ప్రభావాన్ని అర్థం చేసుకోవడం వంటివి గాంధి సినిమా చూడటం వల్ల విద్యార్థులు మరింత లోతుగా శాంతి మరియు అహింస పాఠాలను అర్థం చేసుకోవడానికి సహాయపడ్డాయి. విద్యార్థులు తమ రోజువారీ సంభాషణల్లో గాంధీ బోధనలను చర్చించేలా కూడా చేయడం జరిగింది.

## 4. ప్రపంచ పౌరసత్వం

ప్రపంచ పౌరసత్వం అంటే జాతీయ సరిహద్దులను మించి విస్తరించి ప్రపంచ సమాజానికి చెందినవారమనే విస్తృత భావన. ఇది ఉమ్మడి మానవత్వం, పరస్పర అనుసంధానత, ప్రపంచ మంచికోసం బాధ్యతాయుతంగా ప్రవర్తించడాన్ని తెలుపుతుంది. ప్రపంచ పౌరులు ఒక పెద్ద నెట్ వర్క్ లో భాగమని అర్థం చేసుకోవాలి. తద్వారా న్యాయమైన, స్థిరమైన, శాంతియుత ప్రపంచానికి దోహదం చేయగలుగుతాం. పాఠశాల విద్య పాఠ్య ప్రణాళిక ప్రపంచ దృక్పథాలు మరియు ఆధునిక సాంకేతిక పురోగతిని కలిగి ఉంది.దీని లక్ష్యం ప్రపంచం కోసం విద్యార్థులను సిద్ధం చేయడం, ప్రపంచ పౌరసత్వం యొక్క భావనను పెంపొందించడం, బహుళ సాంస్కృతికత, మరియు బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తన, గ్లోబలైజేషన్, మైగ్రేషన్, ఇమ్మిగ్రేషన్ మరియు బహుళ సాంస్కృతికత వంటి ప్రపంచ భావనలను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచడం వల్ల విద్యార్థులు పరస్పర సంబంధాల ఆవశ్యకతను మరియు విభిన్నతను అర్థంచేసుకోవడానికి సహాయపడుతుంది. బహుళ సాంస్కృతిక సమాజంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన విశ్వమానవభావనను అభివృద్ధి చేయడం, ప్రపంచ అసమానతలపై తరగతి గది చర్చలు జరిగేలా అభ్యసన ప్రక్రియలో భాగం చేయడం కీలకాంశం. ఇవి విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలు మరియు కమ్యూనిటీలు ఎదుర్కొంటున్న సవాళ్లు,ఆర్థిక అసమానతలు, వనరుల అందుబాటు, సామాజిక న్యాయం, విమర్శనాత్మక ఆలోచన మరియు సహానుభూతిని, బాధ్యతా భావాన్ని, సమానత కలిగిన ప్రపంచాన్ని నిర్మించడానికి

సృష్టికి దోహదం చేస్తాయి. విద్యార్థుల పరిధిని విస్తృతం చేసేందుకు యూకే, యూఎస్ఏ వంటి దేశాలకు చెందిన వివిధ దేశాల విద్యార్థులతో సంప్రదింపులు జరిపేందుకు ఈ పరస్పర చర్యలు ఒక అవకాశాన్ని అందిస్తాయి. క్రాస్-కల్చరల్ ఎక్స్ఛేంజ్ మరియు లెర్నింగ్, విద్యార్థుల అనుభవాలు, ఆలోచనలు మరియు దృక్పథాలు పంచుకోవడానికి దోహదపడుతుంది. ఇవి విద్యార్థులలో గ్లోబల్ నెట్ వర్క్ లను నిర్మించడానికి, కమ్యూనికేషన్ మరియు సహకార నైపుణ్యాల మెరుగుదలకు సహాయపడతాయి.

తెలంగాణాలోని కొన్ని పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయుల సహకారంతో బ్రిటన్, అమెరికా లాంటి దేశాల విద్యార్థులతో ప్రతి శనివారం "విద్యావారధి" పేరిట వివిధ అంశాలపై చర్చిస్తున్నారు. ఉదాహరణ నీటివనరులు, చెత్త సేకరణ, మొక్కల పెంపకం మొదలైనవి. దీని వలన వివిధ దేశాల సంస్కృతులపై విద్యార్థులకు అవగాహన కలుగుతున్నది.

సాంకేతికత ప్రపంచ పౌరుల మధ్య స్నేహ సంబంధాలకు వేదికగా నిలుస్తున్నది. ఇది సానుకూల అంశమే. దీంతోపాటు సాంకేతికతపరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. విద్యలో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి ప్రతిస్పందనగా సైబర్ భద్రత తప్పనిసరి. విద్యాశాఖ సహకారంతో సెకండరీ స్కూళ్లలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కోసం స్టూడెంట్ సైబర్ అంబాసిడర్లను ఎంపిక చేయడం జరిగింది. వీరు సైబర్ చట్టాలు, డిజిటల్ పద్ధతుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రతీ ఉన్నత పాఠశాలకు కనీసం మూడు IFP లను అందజేయడం జరిగింది. వీటి ద్వారా ప్రపంచంలోని వివిధ అంశాల డిజిటల్ వనరులను వీక్షించే, ప్రతిస్పందించే అవకాశం కల్పించడం జరిగింది. డిజిటల్ ప్లాట్ ఫారాలను ఉపయోగిస్తున్నప్పుడు గోప్యత, నైతిక డిజిటల్ ప్రవర్తన, ఆన్లైన్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతున్నది. వారు డిజిటల్ ప్రపంచాన్ని సురక్షితంగా మరియు బాధ్యతాయుతంగా నావిగేట్ చేసేలా చూడడం జరుగుతున్నది.

తెలంగాణ ఉపాధ్యాయులు గ్లోబల్ టీచర్ అవార్డులు అందుకోవడం వారి అంకితభావాన్ని, నైపుణ్యాన్ని తెలియజేస్తున్నది. ఇది ఇతరులు కృషి చేయడానికి ప్రేరణగా కూడా ఉపయోగపడుతున్నది.

గ్లోబల్ కాంపిటీషన్స్ లో పాల్గొనడం కోసం తెలంగాణ విద్యార్థులను సకురా వంటి అంతర్జాతీయ కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహించడం జరుగుతున్నది. ఈ పోటీలు విద్యార్థులు తమ ప్రతిభను అంతర్జాతీయ

వేదికపై జ్ఞానం,సృజనాత్మకతను ప్రదర్శించడానికి ఒక వేదికను అందజేస్తున్నాయి. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతున్నది. అలాగే అత్యాధునిక శాస్త్ర సాంకేతిక పురోగతి వారి అందుబాటులోకి రావడం జరుగుతున్నది.

ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పండుగల వేడుకలు, సంప్రదాయాలు, తెలంగాణ సాంస్కృతిక ఉత్సవాలను జరుపుకోవడం, రాష్ట్ర గొప్ప వారసత్వాన్ని పెంపొందించడం... ఈ వేడుకలు విద్యార్థుల్లో గర్వ భావాన్ని, సాంస్కృతిక గుర్తింపును పెంపొందిస్తున్నాయి. అంతర్జాతీయంగా సాంస్కృతిక మార్పిడి మరియు అవగాహనను పెంపొందిస్తున్నాయి.

## 5. జెండర్

పాఠ్యప్రణాళిక మొత్తం జెండర్ సమానత్వాన్ని ప్రోత్సహించేలా జెండర్ సమానత్వం యొక్క సూత్రం చుట్టూ కేంద్రీకృతమై రూపొందించబడింది. జెండర్ తో సంబంధం లేకుండా విద్యార్థులందరూ సమానంగా అభివృద్ధి చెందేలా ప్రయత్నం చేయడం జరుగుతున్నది. జెండర్ సమానత్వాన్ని విడివిడిగా కాకుండా విద్యానుభవం అంతటా ఒకదానితో ఒకటి ముడిపడి ఉండేలా ఏకీకృతం చేయడం జరిగింది. నాయకత్వంతోనే సమర్థవంతమైన అమలు మొదలవుతుందని భావించి ప్రధానోపాధ్యాయులందరికీ జెండర్ అంశాలపై ఓరియెంటేషన్ నిర్వహించడం జరిగింది. పాఠశాలల్లో జెండర్ సమానత్వ వాతావరణాన్ని పెంపొందించడానికి అవసరమయిన జ్ఞానం మరియు నైపుణ్యాలు అందించడంతో పాటు పాఠశాల సంస్కృతి మరియు విధానాలను ప్రభావితం చేయడంలో జెండర్ పై సరయిన దృక్పథాన్ని ఏర్పరచడం జరిగింది.

జెండర్ సమానత్వ పాఠ్యప్రణాళికకు మద్దతు ఇవ్వడానికి రెండు స్థాయిల కరదీపికలు అభివృద్ధి చేసి పాఠశాలలకు పంపిణీ చేయబడ్డాయి. లెవల్ -1 పుస్తకాలు 6 నుంచి 8వ తరగతి వరకు, లెవల్ -2 పుస్తకాలు 9, 10 తరగతుల కోసం అందజేయడం జరిగింది. ఉపాధ్యాయులు జెండర్ సమానత్వ అంశాలను సమర్థవంతంగా బోధించడానికి మార్గదర్శకత్వం మరియు వనరులతో ఒక కరదీపికను కూడా అందజేయడం జరిగింది.

జీవన నైపుణ్యాలపై రెండు మాడ్యూల్స్ ను రూపొందించడం జరిగింది. ఇందులో జెండర్ పై ప్రత్యేకంగా ఒక అధ్యాయం ఉంది. ఈ మాడ్యూల్స్ విద్యార్థులను అవసరమైన జీవన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే

లక్ష్యంగా కలవు. జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళికలో జెండర్ ను చేర్చడం ద్వారా విద్యార్థులు దైనందిన జీవితంలో జెండర్ సమానత్వం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం మరియు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోగల అవకాశం కల్పించడం జరిగింది. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేసిన ఆరోగ్యం మరియు శ్రేయస్సు మాడ్యూల్ స్థానిక విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండేలా తెలుగులోకి అనువదించడం జరిగింది. విద్యార్థులకు ఆరోగ్యం మరియు శ్రేయస్సుపై వారికి అర్థమయ్యే భాషలో అంశాలను అందుబాటులోకి తేవడం జరిగింది. పాఠ్యాంశాలలో, పాఠ్యాంశ సంబంధ చిత్రాలలో అన్ని అంశాలలో జెండర్ సమానత్వాన్ని ప్రతిబింబించేలా ఇవ్వడం జరిగింది.

అన్ని పాఠశాలలలో జెండర్ సమానత్వాన్ని నిర్ధారించే దిశగా మరో ముఖ్యమైన అడుగు "అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల" ఏర్పాటు. ఈ కమిటీల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించు మరియు నిర్వహణ, పాఠశాల వాతావరణం అభ్యసనానికి అనుకూలంగా ఉండేలా చూసుకోవడం, జెండర్ భేదం లేకుండా విద్యార్థులందరికీ అవసరమయిన అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతున్నది.

## 6. వైవిధ్యం

భారతదేశంలోని వివిధ ప్రాంతాల వారిలో ఐక్యత మరియు సాంస్కృతిక సమైక్యతను పెంపొందించడానికి ఉద్దేశించినది 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'. సాంస్కృతిక సంపన్నత,విభిన్న సంస్కృతుల పట్ల ప్రశంసలు, భాషా వైవిధ్యాన్ని పరిచయం చేయడంతో పాటు పాఠశాల పిల్లలకు హర్యానా భాషను పరిచయం చేయడం ఒక ముఖ్యమైన కార్యకలాపంగా అమలు చేయడం జరిగింది. ప్రతిరోజూ పాఠశాల అసెంబ్లీ సమయంలో విద్యార్థులకు హర్యానా భాషతో సహా వివిధ భాషల నుండి ఒక కొత్త పదాన్ని పరిచయం చేయడం జరిగింది. ఈ విధానం విద్యార్థుల పదజాలాన్ని సుసంపన్నం చేసింది. ఇతర భాషల పట్ల ఆసక్తి మరియు గౌరవాన్ని కూడా కలిగించింది. భారతదేశంలోని 12 వేర్వేరు రాష్ట్రాలకు చెందిన విభిన్న భాషా మరియు సాంస్కృతిక నేపథ్యాల నుండి వచ్చిన పిల్లలు రాష్ట్ర సమ్మిళిత విద్యావిధానాలతో విద్యను పొందుతున్నారు. ఇది పాఠశాలల్లో ఉపయోగించే బోధనా భాషలలో వైవిధ్యతను ప్రతిబింబిస్తుంది. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ,తమిళం, గుజరాతీ, మరాఠీ, కన్నడ ఇలా ఎనిమిది భాషల్లో భాషను బోధిస్తున్నారు. ఈ బహుభాషా విధానం విభిన్న ప్రాంతాల విద్యార్థులను సర్దుబాటు

చేయడం, మరింత సమ్మిళిత మరియు సామరస్యపూర్వక అభ్యసన వాతావరణాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది.

'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' విలువలను మరింత బలోపేతం చేసేందుకు మతం, భారతీయ సంస్కృతి, వారసత్వం మరియు స్థానిక సంప్రదాయాల భావనలను పాఠ్యపుస్తకాలలో చేర్చడం జరిగింది. భారతదేశ వివిధ మతాలు మరియు సాంస్కృతిక ఆచారాల గురించి తెలుసుకోవడం ద్వారా, విద్యార్థులు వైవిధ్యం పట్ల విస్తృత అవగాహన మరియు గౌరవాన్ని పెంపొందించుకొనుటకు ఈ విధానం సహాయపడుతుంది. యువ అభ్యాసకుల మధ్య సహనం మరియు పరస్పర గౌరవానికి చెందిన పునాదిని నిర్మించడం కోసం సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలు, ఇంటర్-స్కూల్ పోటీలు,సాంస్కృతిక కేంద్రాల సందర్శన కార్యక్రమాలు విద్యార్థులకు సహాయపడుతున్నాయి. విభిన్న సాంస్కృతిక నేపథ్యాల నుండి వచ్చిన తోటివారితో, స్నేహాలు మరియు అవగాహన పెంపొందుతున్నది. సాంస్కృతిక విద్య మరియు సహపాఠ్య కార్యకలాపాలను ఏకీకృతం చేయడం ద్వారా భారతదేశం యొక్క భిన్నత్వంలోని ఐక్యతను తెలిపేలా గర్వపడే ఒక తరం విద్యార్థులను సమర్థవంతంగా తయారుచేయడం జరుగుతున్నది. ఇవన్నీ ఉపాధ్యాయ విద్యలో కూడా చేర్చడం జరిగింది.

## యూనిట్ 3: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పాఠశాల నాయకుల పాత్ర (Role of School Leaders in Achieving Sustainable Goals)

### అభ్యసన ఫలితాలు

1. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పాఠశాల నాయకులు పోషించాల్సిన పాత్రను గుర్తిస్తారు.
2. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు పాఠశాల నాయకులు నిర్వహించవలసిన అంశాలను వివరిస్తారు.

మానవ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించేది విద్య. ఆ విద్యను అందించేది విద్యాలయాలు. ప్రస్తుతం సుస్థిరాభివృద్ధి విషయంలో కూడా మార్పు అనేది పాఠశాల నుండే ప్రారంభం కావాలి. కాబట్టి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అంశాలను ప్రతి విద్యార్థి అవగాహన చేసుకోవాలి. పాఠశాల నాయకులుగా ప్రధానోపాధ్యాయులు సుస్థిరాభివృద్ధి

లక్ష్యాల ఆవశ్యకత, వాటి నేపథ్యం గురించి ముందు అవగాహన చేసుకోవాలి. మనం మొదటి రెండు యూనిట్లలో ఆ అంశాలన్నీ చర్చించాం. ఈ 17 లక్ష్యాలు ప్రపంచాన్ని, మానవ జీవితాన్ని, వ్యక్తుల జీవితాన్ని, సమాజాలను ప్రభావితం చేస్తాయని గుర్తించాలి. కాబట్టి ఇవన్నీ కూడా విద్యార్థులు పాటించేలా పాఠశాల మార్గదర్శకత్వం వహించాలి. ఇందుకు మొదట నాయకత్వం వహించాల్సింది ప్రధానోపాధ్యాయులు. కాబట్టి ప్రధానోపాధ్యాయులు 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పైన పూర్తిస్థాయి అవగాహనను పొందాలి. విద్యాశాఖ 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను కరికులంలో భాగంగా చేర్చడం జరిగింది. ఒక్కోసారి ఈ అంశాలు విడివిడిగా, కొన్నిసార్లు సమ్మిళితంగా కలవు.పాఠ్య ప్రణాళికలో 17 లక్ష్యాలు భాగమైనప్పటికీ ముఖ్యంగా నాణ్యమైన విద్యను సాధించడం కొరకు పాఠశాలనే బాధ్యత వహించవలసి ఉంది. కాబట్టి నాణ్యమైన విద్యను సాధించాల్సిన ఒక సంస్థగా కూడా పాఠశాల పని చేయవలసి ఉంటుంది.

## సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు – పాఠశాల నాయకుల పాత్ర

ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు వివిధ సబ్జెక్టులలోని పాఠ్యాంశాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన అంశాలు ఎక్కడెక్కడ ఉన్నాయో పాఠశాల నాయకులు అవగాహన కలిగి ఉండాలి. ఈ అంశాలను ఆయా సబ్జెక్టు టీచర్లతో నిరంతరం చర్చిస్తూ ఉండాలి. పాఠ్యాంశాలలోని అంశాలు ప్రశ్నలు– జవాబులు, పరీక్షలు, మార్కులు, ర్యాంకులు - గ్రేడులకు సంబంధం లేకుండా విద్యార్థులు అవగాహన చేసుకుని దైనందిన జీవితంలో అమలుపరిచే విధంగా పాఠశాలలో తరగతి గది ప్రక్రియలను, సహపాఠ్య కార్యక్రమాలను నిర్వహించేలా చూడాలి. లక్ష్యాత్మకంగా బోధనాభ్యసన ప్రక్రియల అమలు దావరా ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించేలా పాఠశాల నాయకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రతీసారి ఈ అంశాల యొక్క ప్రగతిని సమీక్షిస్తూ అందుకు అనుగుణమైనటువంటి ప్రణాళికలు రూపొందించి, ఆ ప్రణాళికలు తప్పనిసరిగా పాఠశాలలో మరియు తరగతి గదులలో అమలు జరిగేలా చూడాలి. చాలా అంశాలు పాఠ్యప్రణాళికలో భాగంగా ఉన్నాయి మరియు పాఠశాల కార్యక్రమాల్లో చేర్చడం కూడా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ మరియు విద్యాశాఖ ఆదేశాలు, నిర్ణయాలు, కార్యక్రమాలు కూడా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా ఎంతగానో తోడ్పడుతాయి. వాటిని సమర్థవంతంగా అమలు

చేయడం ద్వారా లక్ష్య సాధన దిశలో ఇవి ఎంతగానో తోడ్పడుతాయి. వాటిని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా మనము ఖచ్చితంగా ఫలితాలను సాధించగలం.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఒక ప్రణాళికను రూపొందించుకొని ఎప్పటికప్పుడు ఎంత మేర ప్రగతి సాధించామో పరిశీలించి సమీక్ష నిర్వహించి వాటిని నిర్ణీత కాలవ్యవధులలో సాధించేందుకు అన్ని వనరులను మరియు అన్ని అంశాలను ఉపయోగించుకోవాలి. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో ఈ అంశాలపై చర్చ జరిగేలా చూడాలి. పేరెంట్ టీచర్ మీటింగ్ లలో, సమాజ కార్యక్రమాల్లో కూడా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పైన చర్చ జరిగేలా చూడాలి. కుటుంబాలు మరియు సమాజం నిర్వహించవలసిన పాత్ర గురించి ఎప్పటికప్పుడు వారికి మార్గ నిర్దేశం చేయాలి. అప్పుడు ఖచ్చితంగా మనము సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించగలుగుతాం. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో నాలుగోదైన నాణ్యమైన విద్యను సాధించడం మన ప్రథమ కర్తవ్యము కూడా. దాన్ని సమర్థవంతంగా పూర్తి చేయవలసిన అవసరం ఉంది.

## సహపాఠ్య కార్యక్రమాలు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో నిర్దేశించుకున్న అంశాలు పాఠ్యప్రణాళికలో ఒక భాగంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం సహపాఠ్య కార్యక్రమాలను పాఠ్యప్రణాళికలో ఒక అంశంగా భావిస్తున్నారు. అన్ని కార్యక్రమాల నిర్వహణలో సుస్థరాభివృద్ధి లక్ష్యాలను ఒక అంశంగా అమలుచేయాలి. జాతీయ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ దినోత్సవాల నిర్వహణ, పాఠశాల కార్యక్రమాల ప్రణాళిక అమలులో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను తప్పక దృష్టిలో ఉంచుకోవాలి. ఇలాంటి కార్యక్రమాలలోనే జెండర్, మానవ హక్కులు, వైవిద్యత వంటివి అవగాహన కల్పించవచ్చు. అమలుచేయవచ్చు. ఇవి విద్యార్థులు దైనందిన జీవితాలతో అమలుచేయుటకు ప్రాతిపదికను కల్పిస్తాయి.

## తల్లిదండ్రులు – సమాజ భాగస్వామ్యం

పాఠశాల సమాజానికి సూక్ష్మరూపంగా భావించబడుతుంది. పాఠశాల కార్యక్రమాలు తప్పక సమాజంలో ప్రతిబింబించాలి. సమాజ భాగస్వామ్యం లేకుండా పాఠశాల ఒంటరిగా ఏ లక్ష్యాలను సాధించలేదు. కాబట్టి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో తల్లిదండ్రులను, సమాజాన్ని భాగస్వాములుగా చేయాలి. తల్లిదండ్రుల సమావేశంలో

లక్ష్యాల గురించి చర్చించాలి. వారి దైనందిన జీవితంలో అమలు చేయవలసినన అంశాలను వివరించాలి. సమాజ కార్యక్రమాలలో కూడా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనను మిళితం చేయాలి.

మొక్కలు నాటడం, జెండర్ వివక్షత చూపకపోవడం, హక్కుల అమలు వంటి అంశాలలో సమాజానికి అవగాహన కల్పించాలి.ఈ అంశాలలో సమాజాన్ని పాఠశాలకు, పాఠశాలను సమాజానికి వారధిగా చేయవలసింది పాఠశాలనే అని గుర్తించి అమలుచేయాలి.

## పాఠ్యప్రణాళిక

పాఠశాల నాయకులు ప్రతీ తరగతి, ప్రతీ సబ్జెక్టుకు సంబంధించిన పాఠ్యప్రణాళికలను పరిశీలించాలి. వాటిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు ముఖ్యంగా నాణ్యమైన విద్యకు సంబంధించిన అంశాలపై అవగాహన పొందాలి. సుస్థిరాభివృద్ధి మానవ హక్కులు, శాంతి మరియు అహింస, ప్రపంచ పౌరసత్వం, జెండర్ మరియు వైవిద్యానికి చెందిన పాఠశాలను పరిశీలించాలి. ఆయా సబ్జెక్టు టీచర్లతో ఆ అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన విధానం, తరగతి బోధనాభ్యసన ప్రక్రియల అమలుపై చర్చించాలి.

పాఠ్యప్రణాళికలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల అంశాలు ప్రతిఫలించిన విధానంపై, తమ పై అధికారులకు అభిప్రాయాన్ని అందజేయాలి. ఒకవేళ మార్పులు అవసరమైతే సూచించాలి. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో, వివిధ స్థాయిలలో నిర్వహించే సమీక్షా సమావేశాలలో చర్చించాలి. ఇందు కొరకు వివిధ కాల వ్యవధులలో నిర్వహించిన అంశాల ప్రణాళిక రూపొందించుకోవాలి. ఈ ప్రణాళికను ఎప్పటికప్పుడు సమీక్షించాలి.

## తరగతిగది ప్రక్రియలు

నాణ్యమైన విద్యాసాధనలో బోధనాభ్యసన ప్రక్రియలు కీలకపాత్ర పోషిస్తాయి. కాబట్టి వీటికి పాఠశాల నాయకులు అత్యంత ప్రాధాన్యతనివ్వవలసిన అంశంగా గుర్తించాలి. ఉపాధ్యాయుల తరగతిగది నిర్వహణను తప్పక పరిశీలించాలి. ఈ ప్రక్రియలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన లక్ష్యాత్మకంగా అమలు, పురోగతిని పరిశీలించాలి. పరిశీలించిన అంశాలను వ్యక్తిగతంగా ఉపాధ్యాయులతో చర్చించాలి. వినూత్న బోధనావ్యూహాల అమలు, పాఠ్యాంశాల అవగాహన కృత్యాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ఉపాధ్యాయలతో చర్చలు, సమీక్షలు నిర్వహించాలి.

ఉపాధ్యాయులు తగు ప్రణాళికలు, వనరులు, వ్యూహాలు, మధింపు విధానాలు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించి మెరుగుదలకు సూచనలు ఇవ్వాలి.

## సమీక్షల నిర్వహణ

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనను పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో ఒక భాగంగా చేయాలి. ఈ ప్రణాళిక అమలుకు నిర్దేశించుకొన్న కాలవ్యవధులు,వనరులు, బాధ్యతలు అప్పగించిన వారు నిర్వహించే కార్యకలాపాలను, పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి. తద్వారా లక్ష్యాల సాధన నిర్దేశించుకొన్నట్లుగా సాధించడం జరుగుతుంది. ఈ అన్ని అంశాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ప్రణాళికల అమలులో సవాళ్ళు, అడ్డంకులు ఎదురయితే వాటిని అందరితో చర్చించి పునఃప్రణాళిక రూపొందించుకొని అమలు జరిగేలా ప్రయత్నించాలి.

## ముగింపు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 4.7 లో ఉన్నటువంటి ఆరు అంశాలను పాఠ్యప్రణాళికలో చేర్చడం జరిగింది. ఈ ఆరు అంశాలు వివిధ సబ్జెక్టుల్లో సమ్మిళితంగా మరియు నేరుగా కూడా ఉన్నాయి. ఈ అంశాల సాధన పాఠశాలల్లో సరిగా జరిగేటట్లు చూడాలి. వీటికి సంబంధించి విద్యాశాఖ ఇచ్చే కార్యక్రమాలన్నీ లక్ష్యాత్మకంగా నిర్వహించేలా చూడాలి. అప్పుడు మాత్రమే మనం నాణ్యమైన విద్యను సాధించగలుగుతాం. ప్రస్తుతం మనము ఒంటరిగా లేము, ప్రపంచ భాగస్వామ్యంలో ఉన్నాము. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని వేదికల పైన తమ ప్రతిభను, నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. కాబట్టి మనము ప్రపంచ పౌరసత్వం మరియు సమాన విద్యకు సంబంధించిన అన్ని అంశాలు సాధించేలా కృషి చేయవలసి ఉంది.

## మదింపు

1. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో నీతి ఆయోగ్ గుర్తించిన వాటి సంఖ్య

   అ. 17 ఆ. 16 ఇ. 13 ఈ. 14

2. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు – 4నాణ్యమయిన విద్యకు సంబంధించి 7 వ అంశం లో గల రెండు ఇతివృత్తాలను గుర్తించండి

   అ. ఆర్థిక విజయం కోసం సంబంధిత నైపుణ్యాలు కలిగిన వ్యక్తుల సంఖ్యను పెంచడం

   ఆ. విద్యలో అన్ని రకాల వివక్షతలను తొలగించడం ఇ.సార్వత్రిక మౌలిక భాషా మరియు గణిత సామర్థ్యాల సాధన (FLN) ఈ. సుస్థిరాభివృద్ధి కొరకు విద్య, ప్రపంచ పౌరసత్వ విద్య

3. మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని నిర్దేశించుకున్న సంవత్సరం

   అ . 2020 ఆ. 2030 ఇ. 2015 ఈ. 2025

4. యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ రిపోర్ట్ ప్రకారంతెలంగాణా రాష్ట్రం పచ్చదనంలో సాధించిన పెరుగుదల శాతం

   అ . 7.7% ఆ. 8% ఇ. 8.7% ఈ. 8.8%

5. పర్యావరణ విద్య పేరిట ఏ తరగతులకు ప్రత్యేక పుస్తకాలు కలవు

   అ . 6 నుండి 10 ఆ. ↵నుండి 10 ఇ. ↳మరియు 10 ఈ. 1నుండి 10

6. ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమంలో తెలంగాణాతో సమన్వయపరచబడిన రాష్ట్రం

   అ . హర్యానా ఆ. గుజరాత్ ఇ. డిల్లీ ఈ. చత్తీస్ గడ్

7. ప్రతీ నెలా 30 వ తేదీన రెవిన్యూ శాఖ వారు నిర్వహించే కార్యక్రమం

   అ. జెండర్ సమానత రోజు ఆ. పచ్చదనం కార్యక్రమం

   ఇ. పరిశుభ్రతా దినం ఈ. పౌర హక్కుల రోజు

## ఉపయుక్త గ్రంథావళి


- MDG document
- SDG document
- SDG progress reports (2016 to 2024)

- http://unstats.un.org/sdgs